ఇంజాపూర్‌లో ఓపెన్ నాలాను శుభ్రం చేసిన శానిటేషన్ బృందం


ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగిస్తున్న మున్సిపల్ శానిటేషన్ సిబ్బంది

హయత్‌నగర్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): తుర్కయంజాల్ మున్సిపాలిటీలోని ఇంజాపూర్‌లోని ఓపెన్ నాలాలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను ఆదివారం తొలగించారు. 'ఇంజాపూర్‌లో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తం' అనే శీర్షికతో ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి తుర్కయంజాల్ మున్సిపాలిటీ శానిటేషన్ అధికారులు స్పందించారు. ఆదివారం ఉదయమే పెద్ద సంఖ్యలో శానిటేషన్ సిబ్బందిని ఏర్పాటు చేసి ఓపెన్ నాలాలో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించారు. నాలాలో పూడుకున్న మట్టిని తీయడంతో మురుగునీరు సాఫీగా కిందకు వెలుతుంది. దీంతో మిధానీ కాలనీవాసులు, ఇంజాపూర్ గ్రామస్థులు ఆంధ్రజ్యోతి దినపత్రికకు కృతజ్ఞతలు తెలిపారు.

పేదింటి పెళ్లికూతురికి పుస్తె, మెట్టెల అందజేత


పుస్తె, మెట్టెలు అందజేస్తున్న శ్రీనివాస్‌గుప్తా

వనస్థలిపురం, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): పేదింటి పెళ్లికూతురికి పుస్తె, మెట్టెలు, చీర, గాజులను ఉప్పల ఫౌండేషన్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా ఆదివారం నాగోల్‌లోని తన నివాసంలో అందజేశారు. సికింద్రాబాద్‌లోని నిరుపేద కుటుంబానికి చెందిన రత్నప్రభ-చంద్రశేఖర్‌ల కూతురు విష్ణుపల్లవి వివాహం కోసం శ్రీనివాస్‌గుప్తా తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పెళ్లికూతురికి వాటిని అందజేశారు. శ్రీధర్, జైదామోదరం, దాసు, రాకేష్, బాలరాజు, శివకుమార్ పాల్గొన్నారు.


పూర్వవిద్యార్థుల సమ్మేళనంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

వనస్థలిపురం, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా యాచారం మండలం, రంగాపూర్ ప్రభుత్వ పాఠశాలకు చెందిన 1998-1999 పదవ తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం బీఎన్‌రెడ్డినగర్‌లోని ఓ ఫంక్షన్ హాల్లో ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పలువురు రిటైర్డ్ ఉపాధ్యాయులు మాట్లాడుతూ నేటి బాలలే.. రేపటి పౌరులని వారిని సన్మార్గంలో నడిపించే వారే గురువులు అన్నారు. అనంతరం విద్యార్థులు ఆలపించిన పలు పాటలు, నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో గజ్జి శ్రీనివాస్‌గౌడ్, బండి రాజు, సీ.హెచ్.జంగయ్య, సీ.హెచ్ సుభాష్, జీ.యాదయ్య, జే.కిషన్, మంగ, రాధిక, జ్యోతి, హైమావతి, లలితా, సుజాత, సరిత పాల్గొన్నారు.

నేడు ఇతిహాసాలపై మేడసాని ప్రవచనాలు

సైదాబాద్, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి సందర్భంగా ఇతిహాసాలపై సోమ, మంగళవారాలలో టీటీడీ అన్నమాచార్య, ఆళ్వార్ దివ్య ప్రబంధం, శ్రీమత్ భగవద్గీత ప్రాజెక్టు రిటైర్డ్ డైరెక్టర్ మహాసహస్ర అవధాని డాక్టర్ మేడసాని మోహన్ ప్రవచనాలు ఉంటాయని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సౌత్ జోన్ ప్రధాన కార్యదర్శి చలపతిరావు, కోశాధికారి ప్రభాకర్‌రెడ్డి, సూర్యరావు తెలిపారు. సోమవారం ఉదయం 9 నుంచి 11గంటల వరకు భగవద్గీత.. రామాయణ ప్రబంధాలలో పోలికలు. సాయంత్రం 6.30 నుంచి 8.30 గంటల వరకు ఇంద్రప్రస్థకాలనీ అభయాంజనేయస్వామి ఆలయంలో సీతారామ కల్యాణ వైభవంపై ప్రవచనాలు ఉంటాయని వివరించారు. మంగళవారం ఉదయం 11గంటలకు లక్ష్మీనగర్‌లోని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ భవనంలో ఇతిహాసాలలో పితామహుల స్థానం- నేటి సమాజంలో వారి ప్రాధాన్యం, సాయంత్రం 6.30 నుంచి 8.30 గంటల వరకు వినయ్‌నగర్‌లోని విజయ వినాయక ఆలయంలో సీతారామ పట్టాభిషేకంపై ప్రవచనాలు చేయనున్నారని తెలిపారు.

'కాంగ్రెస్ సమావేశాన్ని విజయవంతం చేయాలి'

అబ్దుల్లాపూర్‌మెట్, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ అబ్దుల్లాపూర్‌మెట్ మండల అధ్యక్షుడు కొత్త ప్రభాకర్‌గౌడ్ పిలుపునిచ్చారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మన్నెగూడలోని బీఎంఆర్ సార్థ కన్వెన్షన్‌లో సోమవారం ఉదయం 10గంటలకు నియోజకవర్గం బూత్ కమిటీ, ముఖ్య నాయకుల సన్నాహక సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అధ్యక్షతన నిర్వహించనున్న ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిల్ల శ్రీధర్‌బాబు, భువనగిరి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి హాజరవనున్నట్లు తెలిపారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలానికి చెందిన కాంగ్రెస్ అభిమానులు, కార్యకర్తలు భారీగా హాజరుకావాలని కోరారు.


మహాపడిపూజలో ఆలయ వ్యవస్థాపకుడు వంగా మధుసూదన్‌రెడ్డి, భక్తులు

ఘనంగా మహాపడిపూజ

చంపాపేట, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్ బైరామల్‌గూడ డిఫెన్స్ కాలనీలోని హరిహరక్షేత్ర అయ్యప్పస్వామి ఆలయంలో ఆదివారం మహాపడిపూజను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. స్వామి వారి జన్మదినాన్ని పురస్కరించుకొని జగద్గురు శంకరాచార్య హంపీ పీఠాధిపతులు విద్యారణ్య భారతిస్వామి పూజా కార్యక్రమాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు, చంపాపేట డివిజన్ కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో అర్చకులు రంజిత్‌తాంత్రి, రమణ గురుస్వామి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

రైతు దీక్షను విజయవంతం చేయండి

చాదర్‌ఘాట్, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను ఎత్తిచూపుతూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి సోమవారం నిర్వహించనున్న రైతు దీక్షను విజయవంతం చేయాలని బీజేపీ కిసాన్ మోర్చా భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు మడిగెల లక్ష్మారెడ్డి విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ గ్యారెంటీలను ప్రశ్నిస్తున్న తెలంగాణ రైతాంగం రూ.2లక్షల రుణమాఫీ తక్షణమే చేయాలని, రూ.15వేల రైతు భరోసా వెంటనే అందించాలని, వరికి రూ.5వందల బోనస్ అందించాలని, రూ.12వేలు రైతు కూలీల ఖాతాలో జయ చేయాలని రైతు దీక్షలో డిమాండ్ చేయనున్నట్లు ఆయన వివరించారు. ఈసందర్భంగా భాగ్యనగర్ జిల్లా నుంచి రైతు దీక్షకు పెద్ద ఎత్తున తరలివెళ్లనున్నట్లు ఆయన వివరించారు.

బీజేపీలో చేరిక



బీఆర్ఎస్ అక్బర్ బాగ్ డివిజన్ మాజీ ప్రధాన కార్యదర్శి దశరథ, సీనియర్ నాయకుడు శేఖర్‌గౌడ్‌తో పాటు సుమారు 20మంది కార్యకర్తలు బీజేపీలో చేరారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు కొత్తకాపు రవీందర్‌రెడ్డి, లింగాల హరిగౌడ్, నగర మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్జీల సమక్షంలో వారు బీజేపీలో చేరారు. - సైదాబాద్, ఆంధ్రజ్యోతి


హయత్‌నగర్‌లో అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి తదితరులు


నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ దయానంద్‌గుప్తా, శ్రీనివాస్‌గుప్తా, బాలకిషన్


అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, కూరెళ్ల మహేశ్‌కుమార్


ఎల్బీనగర్‌లో నివాళులు అర్పిస్తున్న మల్కాజిగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్, బీజేపీ అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి


జిల్లెలగూడలో వేడుకల్లో మాజీ ఎమ్మెల్యేలు తీగల, కేఎల్లార్, డీసీసీ అధ్యక్షుడు చల్లా తదితరులు


బాలాపూర్‌లో నివాళులర్పిస్తున్న మేయర్ పారిజాతారెడ్డి, బీజేపీ నేత శంకర్‌రెడ్డి తదితరులు


తుర్కయంజాల్ చౌరస్తాలో రంగారెడ్డి జిల్లా డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య, తుర్కయంజాల్ మున్సిపల్ చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధ, కౌన్సిలర్లు


నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీరెడ్డి, బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, తుమ్మలపల్లి రమేష్‌రెడ్డి, కొప్పుల దినేష్

అంబేడ్కర్‌కు ఘన నివాళి

జోన్ బృందం : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలను ఆదివారం ఎల్బీనగర్, దిల్‌సుఖ్‌నగర్ జోన్ పరిధిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో అంబేడ్కర్ విగ్రహాలకు, చిత్రపటాలకు వివిధ పార్టీల, సంఘాల నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. హయత్‌నగర్‌లో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, బాలాపూర్ చౌరస్తాలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే పి.సబితారెడ్డి, ఎల్బీనగర్‌లో టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్, మల్కాజిగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్, బైరామల్‌గూడలో ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొని అంబేడ్కర్ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు.


బాలాపూర్ చౌరస్తాలో అంబేడ్కర్‌కు శ్రద్ధాంజలి ఘటిస్తున్న మాజీ మంత్రి సబితారెడ్డి తదితరులు


అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న బీజేపీ హైదరాబాద్ ఎంపీ అభ్యర్థి మాధవీలత, కార్పొరేటర్ కొత్తకాపు అరుణ, జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి


సాహెబ్‌నగర్‌లో నివాళులు అర్పిస్తున్న బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ లచ్చిరెడ్డి, తదితరులు


మన్సూరాబాద్‌లో నివాళులు అర్పిస్తున్న కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి, మాజీ కార్పొరేటర్ విఠల్‌రెడ్డి


డీఎస్‌నగర్‌లో నివాళులర్పిస్తున్న ఐఎస్‌సదన్ కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి తదితరులు


అన్మగల్ హయత్‌నగర్‌లో నివాళులు అర్పిస్తున్న కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి, జెనిగే విష్ణువర్ధన్


బైరామల్‌గూడలో నివాళులు అర్పిస్తున్న రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, మధుయాష్కీగౌడ్


బైరామల్‌గూడలో నివాళులు అర్పిస్తున్న కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి


సుభాష్‌చంద్రబోస్ కాలనీలో నివాళులు అర్పిస్తున్న కార్పొరేటర్ సుజాతానాయక్, చంద్రశేఖర్‌రెడ్డి


అబ్దుల్లాపూర్‌మెట్‌లో నివాళులర్పిస్తున్న జడ్పీటీసీ బింగి దేవదాసుగౌడ్ తదితరులు

మల్కాజిగిరి అభివృద్ధికి కృషి చేస్తా

- బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్


మాట్లాడుతున్న ఈటల రాజేందర్

వనస్థలిపురం, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): మల్కాజిగిరి అభివృద్ధి చెందాలంటే తనను రాబోయే ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలని బీజేపీ మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా కొత్తపేట డివిజన్‌లో కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ ఆధ్వర్యంలో సంక్షేమ సంఘాల నాయకులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఈటల రాజేందర్ మాట్లాడుతూ ప్రధాని మోదీ సారథ్యంలో భారతదేశ ఖ్యాతి నలుమూలల ప్రతిధ్వనిస్తుందన్నారు.

ఆర్టికల్ 370, రామమందిర నిర్మాణం, మహిళలకు 33శాతం రిజర్వేషన్ లాంటి చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకోవడం కేవలం మోదీకే సాధ్యమైందన్నారు. తెలంగాణ ఆత్మగౌరవం తెలిసిన వాడిగ నన్ను సంపూర్ణ మెజార్టీతో గెలిపిస్తే మల్కాజిగిరి అభివృద్ధికి మరింతగా కృషి చేస్తానన్నారు. కేంద్రంలో రాబోయేది మోదీ ప్రభుత్వమేనని, నియోజకవర్గ ప్రజలకు ఎం కావాలో నేరుగా ప్రధాని మోదీ వద్దకు ధైర్యం గా వెళ్లి సమస్యలను పరిష్కరించే సత్త తనకే ఉందన్నారు. ఎన్నికల్లో మల్కాజిగిరి ఎంపీగా తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, బీజేపీ ఎల్బీనగర్ సీనియర్ నాయకులు రవీందర్ గౌడ్, గీతారెడ్డి, కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

మల్కాజిగిరి గెలుపులో ఎల్బీనగర్ పాత్ర కీలకం

- టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్


మాట్లాడుతున్న టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్, కోఆర్డినేటర్ కొండల్‌రెడ్డి, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి తదితరులు

ఎల్బీనగర్, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): మల్కాజిగిరి ఎంపీ గెలుపులో ఎల్బీనగర్ నియోజకవర్గం పాత్ర కీలకమని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఆదివారం ఆర్‌కేపురంలోని సురభి ఎలైట్ హోటల్‌లో ఎల్బీనగర్ నియోజకవర్గం ముఖ్య నేతల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో రేవంత్‌రెడ్డిని ఎంపీగా గెలిపించి మల్కాజిగిరి ప్రజలు చారిత్రక తీర్పు ఇచ్చారన్నారు. అదే స్ఫూర్తితో ఈ సారి కూడా కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్‌రెడ్డిని గెలిపించాలని ఆయన కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిత్యం వహించిన మల్కాజిగిరి నియోజకవర్గంలో మళ్లీ కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి శకం మొదలైందన్నారు. దశాబ్దంపాటు ఆయన ముఖ్యమంత్రిగా ప్రజాపాలన అందిస్తారన్నారు. కోఆర్డినేటర్ కొండల్‌రెడ్డి మాట్లాడుతూ మనల్ని నమ్ముకుని వచ్చిన సోదరి పట్నం సునీత మహేందర్‌రెడ్డిని గెలిపించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. సమావేశంలో రోడ్ల అభివృద్ధి సంస్థ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, పీసీసీ మీడియా కమిటీ చైర్మన్ సామ రమ్మోహన్‌రెడ్డి, టీపీసీసీ ప్రతినిధి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ మిద్దెల జితేందర్, జీహెచ్ఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్ సుజాతానాయక్, నాయకులు ఎస్వీ కృష్ణప్రసాద్, రామ్మోహన్‌గౌడ్ పాల్గొన్నారు.

భువనగిరి కోటపై ఎర్రజెండా ఎగరవేస్తాం

- సీపీఎం ఎంపీ అభ్యర్థి ఎండీ జహంగీర్


మాట్లాడుతున్న ఎండీ జహంగీర్

హయత్‌నగర్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): భువనగిరి కోటపై ఎర్రజెండా ఎగరవేసి తీరుతామని సీపీఎం భువనగిరి ఎంపీ అభ్యర్థి ఎండీ జహంగీర్ ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం తుర్కయంజాల్‌లోని రొక్కం సత్తిరెడ్డి గార్డెన్‌లో అబ్దుల్లాపూర్‌మెట్, తుర్కయంజాల్, పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీకి చెందిన సీపీఎం కార్యకర్తల సమావేశం జిల్లా కమిటీ సభ్యుడు డి. కిషన్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జహంగీర్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో విజయం సాధించేందుకు కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. కమ్యూనిష్టు పార్టీ ఆశయాలను, పోరాటాలను, త్యాగాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కోరారు. భారత రాజ్యాంగాన్ని మార్చాలని ప్రయత్నం చేస్తున్న బీజేపీ ప్రభుత్వాన్ని ఎన్నికల్లో ఓడించాలని కోరారు. రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పగడాల యాదయ్య మాట్లాడుతూ పోరాటాలకు నిలయమైన భువనగిరి కిల్లాను కైవసం చేసుకుని ప్రజల తరఫున పార్లమెంటులో పోరాటం చేస్తామన్నారు. ప్రజలు ఆలోచించి ఓటు హక్కును ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ రాష్ట్రకార్యదర్శి అనగంటి వెంకటేష్, జిల్లా కమిటీ సభ్యుడు నరసింహ, నాయకులు ప్రకాష్‌కారత్, అరుణ్‌కుమార్, సత్యనారాయణ, శారద, బాస్కర్, శివకుమార్, శంకర్ పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

- ఆయూష్ మాజీ కమిషనర్ వెలుగోడి రాములు


హయత్‌నగర్‌లో 58వ యోగా సంస్థాపన దివస్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఆయూష్ మాజీ కమిషనర్ వెలుగోడి రాములు

హయత్‌నగర్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): భారతీయ యోగా సంస్థ 58వ సంస్థాపన దివస్ వేడుకలు ఆదివారం హయత్‌నగర్‌లోని బొమ్మిడి నాగిరెడ్డి గార్డెన్‌లో జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయూష్ మాజీ కమిషనర్ వెలుగోడి రాములు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి యోగా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజు యోగా చేయడం వల్ల డాక్టర్ వద్దకు వెళ్లాల్సిన అవసరం రాదని, సంపూర్ణ ఆరోగ్యం పొందుతారని అన్నారు. 58 సంవత్సరాలుగా యోగాలో ఉచితంగా శిక్షణ ఇవ్వడం గొప్ప విషయం అన్నారు. యోగా వల్ల అనేక ఫలితాలు ఉంటాయని తెలిసి కూడా పిల్లలు వాటి పట్ల శ్రద్ధ చూపక పోవడం విచారకరం అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు యోగా గొప్ప దనాన్ని చెప్పి నేర్పించాలన్నారు. కార్యక్రమంలో భారతీయ యోగా సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు కులకర్ణి, ప్రధాన కార్యదర్శి చారి, డివిజన్ తూర్పు అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, భరత్‌రెడ్డి, కృష్ణయ్య, ప్రవీన్, నరేందర్‌సింగ్‌తో పాటు వివిధ యోగా సెంటర్లకు చెందిన మూడు వందల మంది యోగా సాధకులు, శిక్షకులు పాల్గొన్నారు.


హయత్‌నగర్ మండల స్వర్ణకార సంఘం నూతన కార్యవర్గం

హయత్‌నగర్ స్వర్ణకార సంఘం కార్యవర్గం ఎన్నిక

హయత్‌నగర్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్ స్వర్ణకార సంఘం ద్వితీయ మహాసభ ఎన్నికలు ఆదివారం హయత్‌నగర్‌లోని సంఘం కార్యాలయంలో బ్రహ్మశ్రీ రాగిఫణి సతీష్‌కుమార్, బాణాల ద్రోణాచార్య పర్యవేక్షణలో జరిగాయి. హయత్‌నగర్ స్వర్ణకార సంఘం అధ్యక్షుడిగా కొండోజు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా కమ్మదనం సంతోష్‌చారి, కోశాధికారిగా చెన్నోజు కేశవాచారి, ఉపాధ్యక్షులుగా మాచర్ల బ్రహ్మచారి, కూరెళ్ల ప్రవీన్‌చారి, రాయబండి రాజుచారి, సురేష్‌చారి, కార్యనిర్వాహక కార్యదర్శిగా కందుకూరి ఉదయ్‌చారి, సహాయ కార్యదర్శులుగా తుడిమిళ్ల ప్రవీన్‌చారి, బ్రహ్మచారి, కార్యవర్గ సభ్యులుగా గుడికందుల బ్రహ్మచారి, విజయ్‌ప్రసాద్, నగేష్‌చారి, సతీష్‌చారి, ప్రవీన్‌చారి, శ్రీనివాస్, సలహాదారులుగా నాగచారి, యాదగిరిచారి ఎన్నికయ్యారు. ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులతో రాష్ట్ర కార్యదర్శి రాగిఫణి సతీష్‌కుమార్ ప్రమాణ స్వీకారం చేయించారు.

మహిళ అదృశ్యం


మౌనిక సాగర్

వనస్థలిపురం, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): ఆస్పత్రికి వచ్చిన మహిళ అదృశ్యమైన సంఘటన ఎల్బీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..హస్తినాపురం భారతినగర్‌కు చెందిన సూరంపల్లి ప్రవీణ్ పెద్ద కూతురు బండారి మౌనిక సాగర్(30)కు గతంలో సతీష్‌తో వివాహం జరిగింది. వీరికి 7సంవత్సరాల కుమారుడు ఉన్నాడు. మౌనిక సాగర్ ప్రైవేట్ ఉద్యోగం చేస్తుంది. గతంలో భర్త వేధింపులు భరించలేక ఇంటి నుంచి వెళ్లిపోయింది. దీంతో ఆమె కుటుంబ సభ్యులు ఆచూకీ తెలుసుకుని ఇంటికి తీసుకవచ్చి సర్దిచెప్పారు. ప్రవీణ్ చిన్న కూతురు ఆరోగ్యం సరిగా లేకపోవడంతో బైరమాల్‌గూడలోని ఆవేర్ గ్లోబల్ ఆస్పత్రికి తీసుకవచ్చారు. ఈనెల 4న మౌనిక సాగర్ తన చెల్లలు బాగోగులు చూసుకోవడం కోసం ఆస్పత్రికి వచ్చింది. అదేరోజు రాత్రి మౌనిక సాగర్ ఎవరికి సమాచారం ఇవ్వకుండా ఆస్పత్రి నుంచి బయటకు వెళ్లిపోయింది. ఆమె కుటుంబ సభ్యులు ఎంత వెతికినా సమాచారం లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమంగా రేషన్ బియ్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

- 10క్వింటాళ్ల బియ్యం స్వాధీనం

వనస్థలిపురం, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): అక్రమంగా నిల్వ ఉంచిన ఓ ఇంటిపై ఎస్వోటి పోలీసులు దాడి చేసి 10క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్న సంఘటన వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వనస్థలిపురంలోని విజయపురి కాలనీకి చెందిన సయ్యద్ అస్లాం(40) యాకత్‌పురకు చెందిన ఇమ్రాన్‌తో కలిసి కొంత కాలంగా తక్కువ ధరకు రేషన్ బియ్యం కొనుగోలు చేసి హోటల్స్, కోళ్లఫారాలకు అధిక ధరలకు అమ్ముతున్నాడు. అందులో భాగంగా వనస్థలిపురంలోని విజయపురి కాలనీలో ఓ ఇంట్లో 10క్వింటాళ్ల(26 బ్యాగులు) నిల్వ ఉంచారని ఎస్వోటి పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు రేషన్ బియ్యం నిల్వ ఉంచిన ఇంటిపై దాడి చేసి 10 క్వింటాళ్ల రేషన్ బియ్యంతో పాటు బియ్యం విక్రయిస్తున్న సయ్యద్ అస్లాంను అరెస్ట్ చేసి వనస్థలిపురం పోలీసులకు అప్పగించారు. మరో వ్యక్తి ఇమ్రాన్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మృతదేహం స్వాధీనం

జీడిమెట్ల, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని గాంధీనగర్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దాదాపు 35 ఏళ్ల వయస్సు కలిగిన వ్యక్తి ఐడీపీఎల్ కాలనీ నుంచి జగద్గిరిగుట్ట వెళ్లే దారిలో గల వివేకానంద విగ్రహం వద్ద మృతి చెంది ఉన్నాడు. స్థానికులు జీడిమెట్ల పోలీసులకు సమాచారం అందించగా పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

క్రికెట్ బెట్టింగ్ ముఠా అరెస్ట్

మియాపూర్ : ఎస్‌ఓటీ మేడ్చల్, మియాపూర్ పోలీసులు సంయుక్తంగా మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మాతృశ్రీనగర్‌లో ఆన్‌లైన్ బెట్టింగ్ నిర్వహిస్తున్న ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి ఒక లక్షా 96 వేల రూపాయల నగదు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కాగా ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ ఆర్గనైజ్ చేసిన రాజ్‌కుమార్‌తో పాటు మరో వ్యక్తి పరారీలో ఉన్నట్లు తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.